సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం, 16, సెప్టెంబర్, 2024



భువనగిరిలో స్కేటింగ్ పోటీలు

భువనగిరిలోని న్యూ డైమెన్షన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి.


- 8లో



తీరనున్న తాగునీటి సమస్య

మోత్కూరు మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీరనుంది. అమృత్ 2.0 పథకం కింద రూ.12 కోట్లు మంజూరయ్యాయి.

- 9లో



కృష్ణమ్మ పరవళ్లు

ఎగువనుంచి వరద వస్తుండడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు నాలుగు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు.

- 10లో

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి రద్దు

భువనగిరి టౌన్ : మిలాద్–ఉన్–నబి పండుగ నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ కార్యాలయం అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రోజు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందని, ప్రజలు గమనించి ప్రజావాణికి రావద్దని కోరారు.

17న ప్రజాపాలన దినోత్సవం

భువనగిరి టౌన్ : ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఈనెల 17న కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఎగురవేస్తారని తెలిపారు. అనంతరం ఆయన ప్రసంగిస్తారని, ఆ తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆహ్వానితులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

చౌటుప్పల్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పేర్కొన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఆదివారం నిర్వహించిన ఏచూరి సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీతారాం ఏచూరి దాదాపు ఐదు దశాబ్దాల పాటు పార్టీ కోసం పాటుపడ్డారని, ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్మించారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి గంగదేవి సైదులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు మొగుదాల రమేష్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శులు డిల్లీ మాధవరెడ్డి, అల్లాసిపేట కిష్టయ్య , సీపీఎం నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, ఎండీ.పాష, బండారు నర్సింహ, బత్తుల లక్ష్మయ్య, తడక మోహన్, చీరిక సంజీవరెడ్డి, పల్లె మధుకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యేలు



పీసీసీ అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్ : పీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన మహేష్‌కుమార్ గౌడ్‌ను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆదివారం గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వెంట ఆయా నియోజకర్గాలకు చెందిన కార్యకర్తలు ఉన్నారు.

సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తాం

చౌటుప్పల్ రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని సీపీఐ యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల కార్యదర్శులు గోద శ్రీరాములు, నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఆదివారం చౌటుప్పల్ మండలం మసీదుగూడెంలోని వాకిటి సాయిరెడ్డి స్మారక స్థూపానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులేనన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమిద్దె శ్రీనివాస్, నాయకులుబచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, దుబ్బాక భాస్కర్, కలకొండ సంజీవ, పగిళ్ల మోహన్‌రెడ్డి, పిల్లిశంకర్, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, వాకిటి అమర్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

శోభాయాత్రకు సిద్ధం



భువనగిరిలోని పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన క్రేన్లు, బారికేడ్లు, విద్యుత్ దీపాలు

నేటితో ముగియనున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

- విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేకంగా 16 చెరువులు ఎంపిక
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- భారీ పోలీసు బందోబస్తు
- సీసీ కెమెరాల నిఘా.. అనుక్షణం పర్యవేక్షణ
- జిల్లా వ్యాప్తంగా 3,441 విగ్రహాలు



సాక్షి,యాదాద్రి : వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరాయి. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు సోమవారం గంగ ఒడికి చేరనున్నాడు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా 16 చెరువులను ఎంపిక చేశారు. ఆయా చెరువుల వద్ద అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసు అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీలు ఏర్పాట్లను పరిశీలించాయి. శాంతియుత వాతావరణంలో శోభాయాత్ర కొనసాగాలని, సకాలంలో విగ్రహాలను నిమజ్జనం చేయాలని నిర్వాహకులకు సూచించారు.

చెరువుల వద్ద పటిష్ట ఏర్పాట్లు

జిల్లా వ్యాప్తంగా 3,441 వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి జిల్లాలో 16 చెరువులు అనువైనవిగా రాచకొండ పోలీసులు గుర్తించారు. నిమజ్జనం సందర్భంగా చెరువుల వద్ద విద్యుత్ లైట్లు, బారికేడ్లు, క్రేన్లు ఏర్పాటు చేశారు. 108 అంబులెన్స్‌లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. విగ్రహాల తాకిడి ఎక్కువగా ఉండే భువనగిరిలోని పెద్ద చెరువు వద్ద రెండు క్రేన్‌లు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను సైతం అందుబాటులో ఉంచారు. శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో రహదారులకు మరమ్మతులు చేశారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేశారు.

పట్టణాల్లో స్వాగత వేదికలు

శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు గణేష్ ఉత్సవ సమితుల ఆధ్వర్యంలో స్వాగతం పలకనున్నారు. ఇందుకోసం భువనగిరిలో బాబు జగ్జీవన్‌రాం చౌరస్తా వద్ద స్వాగత వేదిక ఏర్పాటు చేశారు. మిగతా పట్టణాల్లోనూ స్వాగత వేదికలు ఏర్పాటు చేశారు.

శోభాయాత్ర ప్రశాంతంగా జరగాలి



గణేష్ శోభాయాత్ర ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగేలా ప్రజలు సహకరించాలి. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా భక్తి గీతాలు, భజనల నడుమ ఊరేగింపు నిర్వహించాలి. అశ్లీల నృత్యాలు, వేషధారణలకు అవకాశం ఇవ్వొద్దు. ఇతరులకు ఆటంకం కలిగించకుండా ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలి. విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేకంగా చెరువులను ఎంపిక చేశాం. ఆయా చెరువుల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేశాం.

–హనుమంతు కే.జెండగే, కలెక్టర్

అనునిత్యం పర్యవేక్షణ



గణేష్ శోభాయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు ఏసీపీలు, ఆరుగురు సీఐలు, 10 మంది ఎస్సైలు, 200 నుంచి 250 మంది సివిల్ పోలీసులతో పాటు ప్రత్యేక బలగాలను నియమించాం. సీసీ కెమెరాలు, షీటీంలు, క్రైంటీంల పర్యవేక్షణ ఉంటుంది. మద్యం దుకాణాలు బంద్ చేయాలి. నిమజ్జనం సమయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలను చెరువుల వద్దకు తీసుకెళ్లరాదు. భువనగిరి పెద్దచెరువులో నీరుతక్కువగా ఉన్నందున లోతున్న చోటనే విగ్రహాలను నిమజ్జనం చేయడానికి క్రేన్లు ఏర్పాటు చేశాం సకాలంలో శోభాయాత్ర ప్రారంభించి చీకటి పడేలోపు పూర్తి చేయాలి.

–రాజేశ్‌చంద్ర, డీసీపీ

జిల్లా కేంద్రంలో ఐదు రూట్లలో శోభాయాత్ర

భువనగిరి పట్టణంలో పెద్ద ఎత్తున విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఈ నేపథ్యంలో శోభాయాత్రకు ఆటంకం కలగకుండా అధికారులు రూట్‌మ్యాప్ రూపొందించారు. ఐదు రూట్లలో శోభాయాత్ర కొనసాగనుంది. తొలి శోభాయాత్ర బాహర్‌పేట గడ్డమీద ప్రారంభం కానుంది.

రూట్ నెంబర్ 1 : రాంనగర్, న్యూరాంనగర్, ఇంద్రానగర్, ఎల్‌బీ నగర్, రామ్‌తడక్ చౌరస్తా నుంచి బయలుదేరి షియా మసీద్, కుడి మలుపు, షియా మసీద్, ఖాజీమొహల్లా బాలికల పాఠశాల మీదుగా సమద్ చౌరస్తా వైపు విగ్రహాలు కదులుతాయి. కుడి మలుపు కుమ్మరివాడ వైపు నుంచి మసీద్, ప్రిన్స్‌కార్నర్, జగదేవ్‌పూర్ ఎక్స్‌రోడ్డు, ప్రభుత్వ ఆస్పత్రి, హైదరాబాద్ చౌరస్తా నుంచి పెద్ద చెరువుకు శోభాయాత్ర చేరుకుంటుంది.

రూట్ నంబర్ –2 : హనుమాన్‌వాడ, సంజీవ్ నగర్, శ్రుతినగర్ ఆర్‌బీనగర్, అర్బన్ కాలనీ నుంచి శోభాయాత్ర మొదలై పాతబస్టాండ్, వినాయక చౌరస్తా, కొత్తబస్టాండ్, ప్రిన్స్‌కార్నర్ వైపునుంచి వస్తుంది. ప్రిన్స్‌కార్నర్‌లో రూట్ నంబర్–1 నుంచి వచ్చిన శోభాయాత్రతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రి, హైదరాబాద్ చౌరస్తా మీదుగా పెద్ద చెరువుకు చేరుకుటుంది.



నిమజ్జనాన్ని పర్యవేక్షించేందుకు భువనగిరి పెద్దచెరువు వద్ద ఏర్పాటు చేసిన వేదిక

రూట్ నంబర్ –3 : టీచర్స్ కాలనీ, బాహర్‌పేట్, హౌసింగ్‌బోర్డ్‌కు చెందిన విగ్రహాల శోభయాత్ర ఎల్‌బీనగర్‌నుంచి ప్రారంభమై బాహర్‌పేట్ మసీద్, హైదరాబాద్ చౌరస్తా కుడి మలుపు, జలీల్‌పురా మసీద్, శంకర్‌విల్లాస్, చౌక్ మసీద్, సమద్ చౌరస్తా ఎడమ మలుపు తిరిగి కుమ్మరివాడ వైపు కదులుతాయి. ఆజాద్ రోడ్డు, ప్రిన్స్ కార్నర్ నుంచి హైదరాబాద్ చౌరస్తా మీదుగా చెరువు వరకు శోభాయాత్ర చేరుతుంది.

రూట్‌నంబర్ –4 : బంజారాహిల్స్, తారకరామా నగర్, కిసాన్‌నగర్, గంజ్ ప్రాంతానికి చెందిన విగ్రహాలు కరెంట్ ఆఫీస్, కుడివైపు వినాయక చౌరస్తా, కొత్త బస్టాండ్, ప్రిన్స్‌కార్నర్ మీదుగా ప్రధాన రహదారి వైపు కదులుతాయి. ప్రిన్స్ కార్నర్ వద్ద రూట్‌నంబర్–1నుంచి వచ్చిన శోభయాత్రతో కలుస్తుంది.

రూట్‌నంబర్ –5 : తాతానగర్, ప్రగతినగర్‌నుంచి శోభాయాత్ర ప్రారంభం అవుతుంది. ప్రభుత్వ ఆస్పత్రి, హైదరాబాద్ చౌరస్తా, భోంగీర్ ట్యాంక్ వద్ద ప్రధాన రహదారి మీదుగా పెద్దచెరువు వద్దకు చేరుకుంటుంది.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



వినాయ నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. రెండున్నర క్వింటాళ్ల పులిహోర ప్యాకెట్లు, మంచినీటి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నాం. బాబు జగ్జీవన్‌రాం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్ద భక్తులకు ప్రసాదం అందజేస్తాం. ఉదయం 12 గంటలకు శోభాయాత్ర మొదలై మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు నిమజ్జనంతో ముగుస్తుంది.

–రత్నపురం శ్రీశైలం,
గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, భువనగిరి

ఉద్యమనేతకు నివాళి



భువనగిరిలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి దశదిన కర్మకు హాజరై నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

సహకరించిందెవరు ?

సికింద‌ర్‌నగర్‌లో పంచాయతీ భూమి అక్రమ పాతి

- ఖాసీంబి వారుసులమంటూ స్థానికేతరుల తప్పుడు ధ్రువీకరణ పత్రాలు.. వారి పేరున పాతి చేసిన అధికారులు
- ప్రభుత్వ విప్ ఆదేశాల మేరకు విచారణ
- అక్రమ పాతిగా తేలడంతో రద్దు
- రెవెన్యూ అధికారుల పాత్రపై అనుమానాలు!



సికిందర్‌నగర్‌లోని 534 బి 2 సర్వే నంబర్ భూమిలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన కమ్యూనిటీ హాల్

మోటకొండూర్ : ధరణి పోర్టల్‌లోని లొసగులు అక్రమార్కులకు వరంగా మారుతున్నాయి. ఏళ్ల తరబడి మ్యుటేషన్ చేయకుండా పెండింగ్‌లో ఉన్న భూములపై వారు కన్నేశారు. రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో కబ్జాలకు పాల్పడుతున్నారు. అందుకు మోటకొండూరు మండలంలోని సికిందర్‌నగర్‌లో వెలుగుచూసిన భూబాగోతమే నిదర్శనం. నిజాంకాలం నుంచి రికార్డుల్లో వస్తున్న ముస్లింలు.. అదే భూమిపై లేక 50 ఏళ్లు గడుస్తున్నా డీఎస్ పెండింగ్ లిస్టులో ఉన్నట్లు చూపుతోంది. తామే వారసులమని వచ్చి అక్రమ పాతీలు, పట్టాలు చేయించుకుని ఆక్రమణలకు పాల్పడుతున్నారు.

ఏం జరిగిందంటే..

మోటకొండూరు మండలంలోని సికిందర్‌నగర్ గ్రామస్తులు ఆంధ్రా నుంచి వలస వచ్చారు. స్థానికంగా భూములు కొనుగోలు చేసి పత్తి సాగు చేసుకుంటూ ఇక్కడే స్థిరపడ్డారు. వీరు నివాసం ఉంటున్న భూములు గతంలో ముస్లింల పేరున ఉండేవి. వీటిని మోత్కుపల్లి నర్సింహులు మంత్రిగా ఉన్న సమయంలో వలసవచ్చినవారికి ఇళ్ల స్థలాల కోసం కేటాయించారు. 253,532,534 సర్వే నంబర్లలో దాదాపు 20 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించారు. అయితే ఇందులో 6.09 ఎకరాల భూమి అబ్దుల్ రహమాన్ పేరుతో లిస్టులో చూపుతోంది. కాగా 1954లో జన్మించిన అదే పేరుగల వ్యక్తి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో తన పేరున 6.09 ఎకరాల భూమి పట్టా చేయించుకున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూడడంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. దీంతో అధికారులు విచారణ చేయగా అక్రమ పట్టా అని తేలింది. అతనిపై కేసు నమోదు చేసి రిజిస్ట్రేషన్ రద్దు చేశారు.

తాజాగా నాలుగు ఎకరాలు

సికిందర్‌నగర్‌లోనే తాజాగా మరో ఆక్రమణ వెలుగుచూసింది. 534 బి 2 సర్వే నంబర్‌లో నాలుగు ఎకరాల భూమి షేక్ ఖాసీంబీ పేరుతో డీఎస్ పెండింగ్ లిస్టులో చూపుతుంది. అయితే ఈ భూమిలో 30 సంవత్సరాల క్రితమే కమ్యూనిటీ హాల్ నిర్మించారు. 2018లో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాగా గత నెలలో కొందరు వ్యక్తులు షేక్ ఖాసీంబీ వారసులం తామే అంటూ తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పాతికి ప్రయత్నించారు. విషయం తెలిసి గ్రామస్తులు అభ్యంతరం తెలియజేశారు. అయినా రెవెన్యూ అధికారులకు వారికే పాతి చేశారు. దీంతో గ్రామస్తులు ఇటీవల తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. స్పందించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య.. ఇటీవల సికిందర్‌నగర్‌ను సందర్శించి వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ విప్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు విచారణ చేశారు. అక్రమ పాతి అని తేలడంతో పట్టా రద్దు చేశారు.

సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

534 బి2 సర్వే నంబర్‌లోని గ్రామ పంచాయతీకి చెందిన నాలుగు ఎకరాల భూమిని సంబంధం లేని వ్యక్తులకు అక్రమంగా పాతి చేశారు. అధికారుల విచారణలో అక్రమ పాతి అని తేలినందున అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సికిందర్‌నగర్ గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యలకు ధరణి పోర్టలే కారణం

భూ సమస్యలను పరిష్కరిస్తామని గత ప్రభుత్వం గొప్పలు చెప్పి ధరణి పోర్టల్ తీసుకువచ్చింది. కానీ, ధరణి పోర్టలే అన్ని సమస్యలకు కారణం అవుతోంది. అందులోని లోటుపాట్లను సవరించకుండా కాస్తు కబ్జాకాలం తీసివేయటంతో తప్పుడు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. మా ప్రభుత్వం తీసుకువస్తున్న భూమాత పోర్టల్‌తో భూ సమస్యలకు పరిష్కారం లభించనుంది.

–బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్



భూదాన్‌పోచంపల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం నిర్వహిస్తున్న, అభ్యర్థులు, ఓటర్లు

ప్రశాంతంగా పోచంపల్లి చేనేత ఎన్నికలు

- 80.62 శాతం పోలింగ్ నమోదు

భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ కొనసాగింది. అధ్యక్ష పదవికి ఐదుగురు, రెండు మహిళా డైరెక్టర్ల స్థానాలకు నలుగురు, 8 జనరల్ డైరెక్టర్ స్థానాలకు 19 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. కాగా సంఘంలో మొత్తం 2,555 ఓట్లు ఉండగా 2,060 ఓట్లు (80.62 శాతం) పోలయ్యాయని ఎన్నికల నిర్వహణ అధికారులు సీత శ్రీరాములు, అంకం మురళి తెలిపారు.

నేడు ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి

సోమవారం ఉదయం 9 గంటల నుంచి చేనేత డైహౌజ్‌లో ఓట్లు లెక్కించనున్నారు. అనంతరం ఫలితాలు వెల్లడించనున్నారు.



ఓటు హక్కు వినియోగించుకుంటున్న చేనేత కార్మికులు

సాధారణ ఎన్నికల్లా హోరాహోరీ ప్రచారం

బ్యానర్లు, ఫ్లెక్సీలు, నమూనా బ్యాలెట్ పత్రాలు, ప్లకార్డులతో అభ్యర్థులు నిర్వహించిన ప్రచారం సాధారణ ఎన్నికలను తలపించాయి. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు, జనాల కోలాహలం కన్పించింది. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కేజీబీవీలకు కొత్త ఉపాధ్యాయులు

- ఖాళీల భర్తీకి విద్యాశాఖ నిర్ణయం
- జిల్లాలో 8 కేజీబీవీలు, 20 పోస్టులు

భువనగిరి : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. కేజీబీవీల్లో బోధిస్తున్న పలువురు ఉపాధ్యాయులకు వివిధ నోటిఫికేషన్లలో భాగంగా గురుకులాల్లో ఉద్యోగాలు వచ్చాయి. మరికొందరికి ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు రావడంతో వెళ్లిపోయారు. ఈ క్రమంలో కేజీబీవీల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. దీని ఫలితంగా ప్రధాన సబ్జెక్టుల ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధనకు కష్టతరంగా మారింది. తద్వారా విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులు నష్టపోకుండా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులు ఖాళీల భర్తీకి కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లోని సమగ్ర శిక్ష కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టుల భర్తీపై రాష్ట్ర సంచాలకులు స్పష్టమైన ఆదేశిలిచ్చారు.



గుండాల కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయం

నివేదిక అందజేత

జిల్లాలో ఎనిమిది కేజీబీవీలు ఉన్నాయి. వాటిలో 3,095 మంది విద్యార్థులు ఉన్నారు. వివిధ సబ్జెక్టులకు సంబందించి 20 ఖాళీలు ఏర్పడినట్లు గుర్తించారు. 2023 జూలైలో నిర్వహించిన పరీక్షలో మిగిలిన అభ్యర్థులను మెరిట్, రోస్టర్ ప్రకారం ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా అధికారులు రాష్ట్ర విద్యాశాఖకు పంపారు. ఆమోదం అనంతరం నూతన నియామకాలు చేపట్టనున్నారు.

ఖాళీలు ఇవీ..

ఎస్‌ఓ(స్పెషల్ ఆఫీసర్) ఒకటి

సీఆర్టీలు : హిందీ 3, ఇంగ్లీష్ 1, గణితం 2, ఫిజికల్ సైన్స్ 1, బయోసైన్స్ 1, సాంఘిక శాస్త్రం 2

పీజీసీఆర్టీలు : తెలుగు 2, ఇంగ్లీష్ 1, గణితం 1, ఫిజికల్స్ సైన్స్ 2, జువాలజీ 1, సివిక్స్ 1, నర్సింగ్ ఒక పోస్టు ఖాళీ ఉంది.

అర్హులకు అవకాశం

కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో మొత్తం 20 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయి. 2023 జూలైలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో అర్హులను ఇప్పటికే గుర్తించి ఉన్నతాధికారులకు పంపాం. ఆమోదం పొందగానే ఖాళీలు భర్తీ చేస్తాం. వారం రోజుల్లో నియామకాలు పూర్తయ్యే అవకాశం ఉంది.

–నర్సింహ, జిల్లా విద్యాశాఖ అధికారి

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : పంచ నారసింహ క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం ఆలయంలో స్వామి, అమ్మవారి జోడు సేవను ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్య కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

విద్యుదాఘాతంలో వినాయక మండపం దగ్ధం



దగ్ధమవుతున్న వినాయక మండపం

భువనగిరి క్రైం: రాయగిరిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఈ ఘటన శనివారం రాత్రి జరిగింది. కోతులు కరెంట్‌ వైర్లపై దూకడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి వినాయక మండపానికి మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు, నిర్వాహకులు మంటలను ఆర్పివేశారు. పోలీసులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఆత్మకూర్‌(ఎస్‌): అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు ఆత్మకూర్‌(ఎస్‌) మండల కేంద్రంలో పట్టుకొని కేసు నమోదు చేశారు. ఆత్మకూర్‌(ఎస్‌) మండల పరిధిలోని రామన్నగూడెం వాగు నుంచి ఒక ట్రాక్టర్‌లో, మోతె మండలం రావికుంటతండా నుంచి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చౌటుప్పల్‌ రూరల్‌: చౌటుప్పల్‌ మండలం తుఫ్రాన్‌పేట గ్రామ పరిధిలో పాడుబడిన ఇంట్లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుఫ్రాన్‌పేట గ్రామ పరిధిలో విజయవాడ–హైదరాబాద్‌ జాతీయ రహదారి పక్కన గ్రామానికి సమీపంలో ఉన్న పాడుబడిన రేకుల షెడ్డు నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చౌటుప్పల్‌ సీఐ మన్మథకుమార్‌ అక్కడకు చేరుకుని పరిశీలించగా.. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 45–55 ఏళ్లు ఉంటుందని, తెలుపు, నలుపు రంగు దుస్తులు ధరించాడని, యాచకుడు అయ్యి ఉంటాడని సీఐ పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు చౌటుప్పల్‌ పోలీస్‌ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని చౌటుప్పల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్‌ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు



అంబులెన్స్‌లో ఆస్పత్రికి వెళ్తున్న క్షతగాత్రులు

మోత్కూరు: ముగ్గురు యువకులు ఆదివారం బైక్‌పై వెళ్తుండగా.. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌ కాలనీ మలుపు వద్ద బైక్‌ అదుపు తప్పడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు బిహార్‌ రాష్ట్రానికి చెందిన వారిగా తెలిసింది. స్థానికులు వారిని 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తొమ్మిది గోవులు పట్టివేత

చింతపల్లి: కొండమల్లేపల్లి నుంచి అక్రమంగా డీసీఎంలో తరలిస్తున్న తొమ్మిది గోవులను చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం సమీపంలో హైదరాబాద్‌–నాగార్జునసాగర్‌ రాష్ట్ర రహదారిపై ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన గోవులను నాగర్‌కర్నూల్‌ జిల్లా వెల్దండ గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు.

అమ్మమ్మ ఇంటికొచ్చి అనంతలోకాలకు..

- రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని బాలుడు మృతి
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



ఘటనా స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



అబూబకర్‌ సిద్దిఖీ (ఫైల్‌)

నాగారం: సెలవుల్లో అమ్మమ్మ ఇంటికొచ్చిన బాలుడు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన నాగారం మండలం ఫణిగిరి గ్రామ స్టేజీ వద్ద సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్‌ అశ్రఫ్‌, నసీమాబేగం దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు సంతానం. అశ్రఫ్‌ జీవనోపాధి కోసం మూడేళ్ల క్రితం కువైట్‌కు వెళ్లాడు. నసీమాబేగం తల్లిదండ్రుల సొంతూరు నాగారం మండలం ఫణిగిరి గ్రామం కాగా.. ప్రస్తుతం వారు నల్లగొండలో నివాసముంటుండడంతో వారి వద్ద ఉంటూ పిల్లలను చదివిస్తోంది. పాఠశాలకు మూడు రోజులు సెలవులు రావడంతో నసీమాబేగం తన పిల్లలను తీసుకుని తన తల్లిగారి స్వగ్రామమైన ఫణిగిరికి శనివారం సాయంత్రం వచ్చింది. నసీమాబేగం పెద్ద కుమారుడు మహ్మద్‌ అబూబకర్‌ సిద్దిఖీ(8) నల్లగొండలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం తన తాత యాకుబ్‌అలీతో కలిసి ఫణిగిరి గ్రామ స్టేజీ వద్ద ఉన్న కిరాణం షాపు వద్దకు వెళ్లాడు. అక్కడ తినుబండారాలు కొనుగోలు చేసి రోడ్డుకు అవతలి పక్క ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. అనంతరం అక్కడి నుంచి తన అమ్మమ్మ ఇంటికి రావడానికి సూర్యాపేట–జనగామ జాతీయ రహదారి దాటుతుండగా.. సూర్యాపేట నుంచి జనగామ వైపు సిమెంట్‌ బ్రిక్స్‌ లోడ్‌తో అతివేగంగా వెళ్తున్న లారీ అబూబకర్‌ సిద్దిఖీని ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నాగారం ఎస్‌ఐ ఐలయ్య ఘటనా స్థలానికి చేరుకొని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తల్లి నసీమాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కుమారుడు మృతిచెందిన విషయం తెలవడంతో నసీమా బేగం ఘటనా స్థలంలోనే సొమ్మసిల్లి పడిపోయింది. బాలుడి తండ్రి అశ్రఫ్‌ మూడు నెలల క్రితమే నల్లగొండకు వచ్చి తిరిగి కువైట్‌కు వెళ్లాడు. కుమారుడి మరణవార్త తెలిసి కువైట్‌ నుంచి స్వగ్రామానికి బయల్దేరాడు. తండ్రి వచ్చాకే అబూబకర్‌ సిద్దిఖీ అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

మాజీ ఎంపీపీ భర్తపై హత్యాయత్నం

- భూతగాదాలతో కత్తితో దాడి చేసిన యువకుడు

త్రిపురారం : భూతగాదాలతో మాజీ ఎంపీపీ భర్తపై యువకుడు కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన త్రిపురం మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండల కేంద్రానికి చెందిన అనుముల రాజేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఓ మెడికల్‌ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. అతడికి, త్రిపురారం మాజీ ఎంపీపీ అనుముల పాండమ్మ భర్త అనుముల శ్రీనివాస్‌రెడ్డి మధ్య కొంతకాలంగా భూతగాదాలు జరుగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం మాజీ ఎంపీపీ భర్త అనుముల శ్రీనివాస్‌రెడ్డి తన ఇంట్లో నిద్రిస్తున్నాడు. అనుమలు రాజేందర్‌రెడ్డి తన మేనత్త భర్త చనిపోవడంతో మండల కేంద్రానికి వచ్చాడు. ఈ క్రమం భూతగాదాపై ఎటూ తేల్చట్లేదని కక్ష్య పెంచుకున్న రాజేందర్‌రెడ్డి పూటుగా మద్యం సేవించి ఇంట్లో నిద్రిస్తున్న అనుముల శ్రీనివాస్‌రెడ్డిపై కూరగాయలు కోసే కత్తితో దాడి చేశాడు. పక్క ఇంట్లోనే ఉంటున్న త్రిపురారం మాజీ సర్పంచ్‌ అనుముల శ్రీనివాస్‌రెడ్డి వచ్చి శ్రీనివాస్‌రెడ్డిని మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రాజేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎంపీపీ అనుముల పాండమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వై. ప్రసాద్‌ తెలిపారు.

సబ్‌ స్టేషన్‌ ఎదుట రైతుల ఆందోళన

మోతె: మండల పరిధిలో మామిళ్లగూడెం సబ్‌ స్టేషన్‌ నుంచి కొద్దిరోజుల నుంచి త్రీఫేజ్‌ విద్యుత్‌ సరఫరా లేకపోవడంతో సాగుచేసిన పొలాలకు నీళ్లు లేక ఎండిపోతున్నాయని ఆదివారం సబ్‌ స్టేషన్‌ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. మామిళ్లగూడెం, కొత్తగూడెం, విభళాపురం గ్రామాలకు త్రీఫేజ్‌ విద్యుత్‌ సరఫరా కాకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌ సరఫరా ఎందుకు కావడంలేదు అని విద్యుత్‌ సిబ్బందిని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని అన్నారు. అధికారులు చొరవ చూపి త్రీఫేజ్‌ విద్యుత్‌ను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రణబోతు వెంకటరెడ్డి, మైనంపాటి శ్రీనివాస్‌రెడ్డి, గట్టికొప్పుల యల్లారెడ్డి, యుగంధర్‌రావు, సుధాకర్‌, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు



మామిళ్లగూడెం సబ్‌ స్టేషన్‌ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

అక్రమ కేసులు పెట్టారని నిరసన



నిరసన తెలుపుతున్న దళిత మహిళలు, యువకులు

చింతపల్లి: తమ కుటుంబ సభ్యులను కులం పేరుతో దూషించడమే కాకుండా అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని చింతపల్లి మండలం వింజమూరు గ్రామానికి చెందిన పలువురు దళిత మహిళలు ఆదివారం చింతపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్‌ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వింజమూరు గ్రామానికి చెందిన దళిత మహిళలు నూనె సంతోష, పందుల తిరుపతమ్మ ఈనెల 12వ తేదీ రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనంలో పాల్గొనేందుకు వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వారిని కులం పేరుతో దూషించి, బీరు సీసాలు, కర్రలతో దాడి చేసి చంపుతామని బెదిరించారని అన్నారు. ఇదే విషయమై పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో తిరిగి తమపైనే కేసులు పెట్టి జైలుకు పంపారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కులం పేరుతో దూషించి, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో లక్ష్మమ్మ, తిరుపతమ్మ, సరిత, నిఖిత, రాధిక, పారిజాత, లక్ష్మీప్రసన్న, యాదమ్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి

- న్యాయం చేయాలంటూ మృతుడి బంధువుల రాస్తారోకో



హుజూర్‌నగర్‌–మిర్యాలగూడ రహదారిపై రాస్తారోకో చేస్తున్న మృతుడి బంధువులు

గరిడేపల్లి: మండల కేంద్రం శివారులోని తహసీల్దార్‌ కార్యాలయం సమీపంలో అబ్బిరెడ్డిగూడెం క్రాస్‌ రోడ్‌ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కీసర జీడయ్య(42) మృతి చెందాడు. మృతుడు గరిడేపల్లి నుంచి అబ్బిరెడ్డిగూడేనికి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. జీడయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గరిడేపల్లి పోలీస్‌ స్టేషన్‌ ఎదుట మిర్యాలగూడ–హుజూర్‌నగర్‌ రహదారిపై మృతదేహాన్ని ఉంచి రాస్తారోకో చేశారు. ఇరువైపులా వాహనాలు ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వారికి నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చరమందరాజు, ఎస్‌ఐ చలిగంటి నరేష్‌ తెలిపారు.

ఆర్థికసాయం పేరిట కుచ్చుటోపీ పెట్టేందుకు యత్నం

భువనగిరి క్రైం: ప్రముఖ యూట్యూబర్‌ హర్షసాయి పేరిట ఆర్థికసాయం చేస్తామని చెప్పి ఆటో కార్మికుడిని సైబర్‌ నేరగాళ్లు మోసం చేసేందుకు యత్నించారు. వివరాలు.. భువనగిరి మండలం రాయగిరికి చెందిన ఆటో కార్మికుడు ఏర్పుల ఎల్లయ్య పక్షవాతంతో బాధపడుతూ దాతల సహకారంతో చికిత్స పొందుతున్నాడు. ప్రముఖ యూట్యూబర్‌ హర్షసాయి రూ.3,00,000 ఆర్థికసాయం ఇస్తానని చెప్పాడని గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం ఎల్లయ్యకు ఫోన్‌ చేశారు. ముందుగా రూ.4000 తమ అకౌంట్‌కి పంపాలని చెప్పడంతో అతడు పంపించాడు. అనంతరం ఫోన్‌ పే, గూగుల్‌ పే నంబర్‌తో పాటు బ్యాంక్‌ పాసు పుస్తకం ఫొటోలను వాట్సాప్‌ ద్వారా పంపించుకుని అర్ధగంటలో డబ్బులు వేస్తామని చెప్పారు. అనంతరం మళ్లీ ఎల్లయ్యకు ఫోన్‌ చేసి గవర్నమెంట్‌ బ్యాంక్‌ కాకుండా ప్రైవేట్‌ బ్యాంక్‌లో అకౌంట్‌ ఉండాలని, రూ.3లక్షలు ప్రభుత్వ బ్యాంక్‌లో వేయడం ఇబ్బంది అవుతుందని, ప్రైవేట్‌ బ్యాంక్‌లో అయితే ఎలాంటి ఇబ్బంది ఉండదని నమ్మించి మరో రూ.20 వేలు పంపమని అడిగారు. దీంతో అనుమానం వచ్చిన ఎల్లయ్య ఫోన్‌ కట్‌ చేసి తనకు తెలిసిన ఓ టీవీ ఛానెల్‌ రిపోర్టర్‌ని సంప్రదించగా అది ఫేక్‌ కాల్‌ అని చెప్పగా.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌ తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

- ప్రియుడి కుటుంబ సభ్యులే హత్య చేశారని బంధువుల ఆరోపణ



మౌనిక (ఫైల్‌)

మిర్యాలగూడ: ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆదివారం దామరచర్ల మండలం పుట్టలగడ్డలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం మాన్‌తండాకు చెందిన బూక్యా మౌనిక(19), పుట్టలగడ్డకు చెందిన రూపావత్‌ నాగుకు మూడేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. మౌనిక హైదరాబాద్‌లో ఉద్యోగ ప్రయత్నంలో ఉండగా నాగు స్వగ్రామంలోనే ఉంటున్నాడు. కాగా ఆదివారం తెల్లవారుజామున నాగు ఇంటి సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరేసుకుని మౌనిక ఆత్మహత్య చేసుకుంది. మౌనిక ఒంటిపై గాయాలు ఉండడంతో ఆమెను నాగు, అతడి కుటుంబ సభ్యులే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మౌనిక బంధువులు నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై ఆందోళన చేపట్టారు. పోలీసులు వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ వీరబాబు పర్యవేక్షణలో వాడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ప్రవీణ్‌కుమార్‌రెడ్డి (ఫైల్‌)

చిట్యాల: ఇంట్లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చిట్యాల పట్టణంలోని పెద్దబావిగూడెం కాలనీలో జరిగింది. ఆదివారం చిట్యాల ఎస్‌ఐ ఎన్‌. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద బావిగూడెం కాలనీలో నివాసముంటున్న ముప్ప ప్రవీణ్‌కుమార్‌రెడ్డి(42) ఇంటికి శనివారం అతడి స్నేహితుడు రాకేష్‌ వెళ్లగా గడియ పెట్టి ఉంది. రాకేష్‌ కిటికీలోంచి చూడగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కిందపడిపోయి ఉన్నాడు. దీంతో రాకేష్‌ వెంటనే హైదరాబాద్‌లో ఉంటున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కుమారుడు అక్షయ్‌రెడ్డికి ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. అనంతరం ఇంటి తలుపులు తెరిచిచూడగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మృతిచెంది ఉన్నాడు. అతడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవు. మృతుడి మామ నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉండగా, భార్య గతంలోనే మృతిచెందింది.

రౌడీ షీటర్‌ రిమాండ్‌

కనగల్‌: మండల పరిధిలోని చినమాదారం గ్రామానికి చెందిన రౌడీ షీటర్‌ మల్లికంటి యాదగిరిని హత్యాయత్నం కేసులో అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కనగల్‌ ఎస్‌ఐ పి. విష్ణుమూర్తి ఆదివారం తెలిపారు. ఈ నెల 13వ తేదీన కనగల్‌ మండలం శేరిలింగోటం గ్రామంలోని కావేరి వైన్‌ షాప్‌కు వెళ్లి ఉద్దెరకు బీరు ఇవ్వాలని వైన్‌ షాపులో పనిచేస్తున్న మేకల రవిని కోరాడు. వైన్స్‌ యజమాని ఉద్దెరకు ఎవరికీ లిక్కర్‌ ఇవ్వొద్దని చెప్పాడని రవి అనడంతో యాదగిరి ఆగ్రహంతో ఊగిపోయాడు. 'నేను ఎవరో నీకు తెలుసా, బీర్లు ఇవ్వకపోతే నిన్ను చంపేస్తాను' అని బెదిరించి కౌంటర్‌పై ఉన్న బీరు సీసాను తీసుకొని రవి తలపై దాడి చేశాడు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని యాదగిరిని అరెస్ట్‌ చేసి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి అతడికి 14 రోజుల రిమాండ్‌ విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. గతంలో చిన్న మాదారం గ్రామంలో జరిగిన జంట హత్యల కేసులో యాదగిరి ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అంతేకాకుండా అతనిపై పలు కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడికి గాయాలు



కాలిన గాయాలతో మహావీర్‌ సాహు

శాలిగౌరారం: విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శాలిగౌరారం మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం ముంగేలి జిల్లా సలాయి పతేరా గ్రామానికి చెందిన మహావీర్‌ సాహు(26) భార్యతో కలిసి కొంతకాలంగా నకిరేకల్‌లో నివాసం ఉంటూ భవన నిర్మాణ పనులకు వెళ్తున్నాడు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద పనులు చేసేందుకు గత ఐదు రోజులుగా నకిరేకల్‌కు చెందిన తాపీమేస్త్రీతో కలిసి వస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం భవన నిర్మాణ పనులు చేస్తుండగా భవనం పక్కన ఉన్న 33/11 కేవీ విద్యుత్‌ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్‌ హాస్పిటల్‌కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది.

అత్యాచారాలను అడ్డుకునే బాధ్యత కార్యకర్తలదే..

- వీహెచ్‌పీ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి భజరంగ్‌లాల్‌ బాంగిడియా



మాట్లాడుతున్న భజరంగ్‌ లాల్‌ బాంగిడియా

యాదగిరిగుట్ట: స్త్రీల మీద జరుగుతున్న అత్యాచారాలను, లవ్‌ జిహాదీలను అడ్డుకునే బాధ్యత విశ్వ హిందూ పరిషత్‌ కార్యకర్తలదేనని వీహెచ్‌పీ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి భజరంగ్‌లాల్‌ బాంగిడియా, జాతీయ ప్రధాన కార్యదర్శి అంబరీష్‌ జీ పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట పట్టణంలో అఖిల భారత విశ్వహిందూ పరిషత్‌ విశేష సంపర్క విభాగం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జైనూర్‌లో గిరిజన మహిళపై జరిగిన పాశవిక చర్యను, గిరిజనులపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలు చాలా బాధకరమన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించారు. మహిళలపై, హిందువులపై ఎలాంటి దాడులు జరిగిన వీహెచ్‌పీ కార్యకర్తలు ఉద్యమించాలని, నిందితులకు శిక్ష పడేలా పోరాడాలన్నారు. దక్షిణ భారత కార్యదర్శి సంజయ్‌ దొవలకర్‌, తెలంగాణ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌ రాజు, రాష్ట్ర సహ కార్యదర్శి తోట భానుప్రసాద్‌, జిల్లా అధ్యక్షుడు పోత్నాక్‌ రాఘవేందర్‌ పాల్గొన్నారు.

- పచ్చందాల ప్రకృతి



భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామ శివారులో పచ్చని వరి పొలాలు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం సూర్యాస్తమయం వేళ ఆకాశంలో ఏర్పడిన నారింజ రంగు వెలుగులో ఆ పచ్చదనానికి మరింత వన్నె తెచ్చింది.
– భూదాన్‌పోచంపల్లి

దుబాయ్‌ టూర్‌ ప్యాకేజీ అంటూ మోసం

- టికెట్లు, వీసా ఇవ్వకుండా ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేసుకున్న లోటస్‌ హాలిడేస్‌ సంస్థ యజమాని
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

సూర్యాపేటటౌన్‌: దుబాయ్‌ టూర్‌ ప్యాకేజీ ఇప్పిస్తానని మోసం చేసిన సంస్థపై బాధితులు ఆదివారం సూర్యాపేట పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన గుండా లక్ష్మయ్య, కారంశెట్టి వెంకట సత్యనారాయణ ఈ నెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు అబుదాబీలో నిర్వహిస్తున్న వామ్‌ వరల్డ్‌ ఆర్యవైశ్య మహాసభకు హాజరై అనంతరం దుబాయి, అబుదాబీ సందర్శించుటకు లోటస్‌ హాలిడేస్‌ సంస్థ మేనేజింగ్‌ పార్టనర్‌ సుభాష్‌చంద్ర ఘంటసాలకు ఆరు రోజుల ప్యాకేజీ కింద కొంత మొత్తాన్ని చెల్లించారు. ఈ మేరకు సుభాష్‌చంద్ర ఈ నెల 13న శంషాబాద్‌ ఎయిర్‌పోర్ట్‌లో వారికి విమాన టికెట్లు, వీసా ఇస్తానని చెప్పాడు. ఆ రోజు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న లక్ష్మయ్య, వెంకట సత్యనారాయణ సుభాష్‌ చంద్రకు ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ వచ్చింది. దీంతో అతడి ఆఫీస్‌ సిబ్బందికి ఫోన్‌ చేయగా వారు కూడా స్విచ్ఛాఫ్‌ చేసుకోవడంతో తాము మోసపోయామని గ్రహించి ఆదివారం సూర్యాపేట పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వేంకటేశ్వర ఆలయంలో గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు

భువనగిరి రూరల్‌: శ్రవణ నక్షత్రం సందర్భంగా రాయగిరిలోని స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఆదివారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాల్య హనుమంతునాయక్‌, గడ్డమీది సత్యనారాయణ, సామల శ్రీరాములు, ఎదగని శ్రీనివాస్‌, అంకర్ల సంజీవ, గడ్డమీది చంద్రయ్య, భువనగిరి అంజనేయులు, మల్లేశ్‌, శ్రీకాంత్‌రెడ్డి, లోడి వెంకటేశ్వర్‌రావు, శ్రీరామ భక్త భజన మండలి బృందం పాల్గొన్నారు.

భువనగిరిలో రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌ పోటీలు

- 750 మంది క్రీడాకారులు హాజరు



స్కేటింగ్‌ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

భువనగిరి : జిల్లా కేంద్రంలోని న్యూ డైమెన్షన్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో ఆదివారం రెండవ రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌ చాంపియన్‌ షిప్‌ పోటీలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ రోలర్‌ స్కేటింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 750 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను రాష్ట్ర స్కేటింగ్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ మదన్‌మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు రాజగోపాల్‌ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రామకృష్ణ, పిట్టల అబ్బాస్‌, జిల్లా అధ్యక్షుడు అజీమ్‌, యాదయ్య, రాజులు పాల్గొన్నారు. కాగా క్రీడాకారులకు స్థానికంగా వసతి సౌకర్యం కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.



జిట్టా బాలకృష్ణారెడ్డిపై రూపొందించిన ఆడియో, వీడియో సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో బండారు దత్తాత్రేయ



బొమ్మాయిపల్లిలోని జిట్టా నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



జిట్టా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్‌, శ్రీనివాస్‌గౌడ్‌, జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు లింగయ్య, కూసుకుంట్ల